మహా శివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి జాతర పురస్కరించుకుని ఈ నెల 26, 27 తేదీల్లో రామతీర్థాలకు 45 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు డిపో మేనేజరు శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌కోట డిపో నుంచి కూడా బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం, రణస్థలం మీదుగా రామతీర్థాలకు పది బస్సులు... పాలకొండ, చీపురుపల్లి, గరివిడి మీదుగా పాలకొండ డిపో నుంచి 20 బస్సులు తిప్పుతున్నట్టు చెప్పారు. ఎస్‌కోట డిపో నుంచి పుణ్యగిరికి 35 బస్సులు, ఎస్‌కోట నుంచి ధర్మవరం సన్యాసయ్య ఆలయానికి పది బస్సులు కేటాయించినట్లు తెలిపారు.



ఒత్తిడికి దూరమైతే విజయం మీదే!

'మీరు బాగా చదివారు.. పరీక్ష పేపరు ఎలా ఉన్నా చక్కగా రాయగలరు. ఏ ప్రశ్న ఇచ్చినా సమాధానం ఇవ్వగలరు..' ఈ సానుకూల దృక్పథంతో పరీక్షకు వెళ్తే తప్పక విజయం సాధిస్తారని విద్యావేత్తలు సూచిస్తున్నారు. కొద్దిరోజుల్లో టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభం అవుతున్నాయి. ఈ సమయంలో ఎలా ఉన్నామనేదే కీలకం. ఆత్మవిశ్వాసంతో ఉంటే విజయం తప్పక సిద్ధిస్తుందని



మాస్టార్లు, మానసిక నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో కొన్ని చిట్కాలను కూడా పాటిస్తే ఇక తిరుగే ఉండదంటున్నారు. మితాహారం తీసుకోవాలని.. కాసేపు ఉదయం పూట వ్యాయామం చేయాలని.. చదువుతున్నప్పుడు ప్రతి 45 నిమిషాలకు విరామం ఇవ్వాలని.. విద్యార్థులు బృందంగా ఏర్పడి సందేహాలను చర్చించుకోవాలని.. తదితర సలహాలు ఇస్తున్నారు.

6లో

- సానుకూల దృక్పథం.. విజయానికి సోపానం
- పరీక్షల ముందు ప్రశాంతంగా ఉండండి
- అతిగా తినవద్దు
- ఆరోగ్యమూ ముఖ్యమే
- టెన్త్, ఇంటర్ విద్యార్థులకు నిపుణుల సూచనలు

జీబీఎస్ కలవరం





- జిల్లాలో ఒక అనుమానిత కేసు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యఆరోగ్యశాఖ
- అవగాహనకు జిల్లా కేంద్రాస్పత్రిలో ప్రత్యేక విభాగం
- అందుబాటులో ఇమ్యునోగ్లోబిన్ ఇంజెక్షన్లు

విజయనగరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వాసులను కొత్త వైరస్ వణికిస్తోంది. మొన్నటి వరకూ మహారాష్ట్ర, తెలంగాణల్లో కలకలం రేపిన గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) ప్రస్తుతం రాష్ట్రంలో కూడా చాపకింద నీరులా వ్యాపించింది. జిల్లాలోనూ ఒక అనుమానిత కేసు వచ్చింది. ఇది అంటువ్యాధి కాదు కానీ నిర్లక్ష్యం వద్దని వైద్యులు సూచిస్తున్నారు. ఆ మధ్య గుంటూరు జీజీహెచ్‌కు ఒకేసారి ఏడు కేసులు వచ్చాయి. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఆస్పత్రుల్లో 17 మంది జీబీఎస్ లక్షణాలతో చికిత్సపొందుతున్నారు. ఈ పరిస్థితిలో ప్రభుత్వం అప్రమత్తమైంది. అన్ని జిల్లాల యంత్రాంగాలను అలెర్ట్ చేసింది. డీఎంహెచ్‌వో జీవనరాణి ఆధ్వర్యంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. వ్యాధి లక్షణాలు సకాలంలో గుర్తించి వైద్యం అందిస్తే త్వరగా నయం అవుతుందని చెబుతున్నారు.

జీబీఎస్ లక్షణాలివీ..

గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) ఒక అరుదైన నరాల వ్యాధి. దీనిని ఆటో ఇమ్యూన్ వ్యాధి అని కూడా అనొచ్చు. శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ, నరాలపై ఈ వైరస్ దాడి చేస్తుంది. ఫలితంగా కండరాల బలహీనత, గొంతు నొప్పి, నడవలేని స్థితి.. అలిసిపోయినట్లుగా అనిపిస్తుంటుంది. మొదటి దశలో చికాకు, నడుము నొప్పి ఉంటుంది. పెరాల్సిస్ మాదిరి పాదాలు, చేతులు, ముఖం నిశ్చేష్టంగా మారుతాయి. చర్మంలో సూది గుచ్చినట్లుగా అనిపిస్తుంది. చేతులు, కాళ్లలో బలహీనత, నడవలేని స్థితి ఏర్పడుతుంది. కొన్ని కేసుల్లో కండరాలు పూర్తిగా పనిచేయకపోవడం, గుండె వేగం మారడం, ఊపిరితిత్తుల సమస్యలు సంభవిస్తాయి. ఈ వ్యాధి లక్షణాలు ఎక్కువగా వైరల్ లేదా బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ తర్వాత కనిపిస్తాయి.

ఎలా గుర్తిస్తారు..?

ఎన్‌సీఎస్(నెర్వ్ కండక్షన్ స్టడీస్) నరాల టెస్టులు, లంబార్ పంక్చర్(మెదడు ద్రవ పరీక్ష), ఈఎంజీ(ఎలక్ట్రోమయోగ్రఫీ) కండరాల పనితీరు వంటి పరీక్షలతో జీబీఎస్ గుర్తించేందుకు వీలుంటుంది. ఈ వ్యాధి నుంచి పూర్తిగా కోలుకోవడానికి సుమారు మూడు నెలల నుంచి ఒక ఏడాది వరకు సమయం పడుతుంది. కొంత మందికి చేతులు, కాళ్లలో బలహీనత లేదా నొప్పి అలానే ఉండిపోయే ప్రమాదం ఉంది.

నివారణ ఇలా..

జీబీఎస్ అత్యంత అరుదుగా సంభవిస్తుంది. సకాలంలో వ్యాధి లక్షణాలు గుర్తించి.. వైద్యుడి వద్ద చికిత్స తీసుకుంటే త్వరగా కోలుకోవచ్చు. వైరల్, బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లను నివారించడానికి హ్యాండ్ వాష్, పరిశుభ్రత పాటించాలి. శరీరంలో ఏదైనా ఇన్ఫెక్షన్ వచ్చినప్పుడు తక్షణమే చికిత్స తీసుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం, జీవనశైలి పాటించాలి. జీబీఎస్ తీవ్రతను బట్టి చికిత్స మారుతుంది.

ఎదుర్కొనేందుకు సిద్ధం

ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. జీబీఎస్‌ను ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. జిల్లా డ్రగ్స్ కంట్రోల్ కేంద్రంలో వైద్యానికి అవసరమైన ఇంజక్షన్లు, మందులు అందుబాటులో ఉంచాం. ఎక్కడైనా వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెనువెంటనే తెలుసుకునేలా యంత్రాంగాన్ని సైతం అప్రమత్తం చేశాం. ప్రజలు ఎటువంటి భయాందోళనకు గురికావాల్సిన పనిలేదు.

- జీవనరాణి డీఎంహెచ్‌వో, విజయనగరం

నిర్లక్ష్యం చేయవద్దు

జీబీఎస్ అనేది ఒక సాధారణ రుగ్మతలాంటిదే. అయితే నిర్లక్ష్యం చేస్తే మాత్రం మూల్యం తప్పదు. 90 శాతం దీనికి సాధారణ వైద్యచికిత్సలే ఉంటాయి. 10 శాతం మందికి మాత్రం వెంటిలేటర్‌పై చికిత్స అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం జిల్లా కేంద్రాస్పత్రిలో జీబీఎస్ వైద్యానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రత్యేక ఇంజెక్షన్లు సైతం ఉంచాం. వ్యాధి లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకూడదు.

- డాక్టర్ కంటుబుక్త సత్యన్నారాయణ, జిల్లా కేంద్రాస్పత్రి, విజయనగరం

వైద్య సిబ్బందితో డీఎంహెచ్‌వో సమీక్ష

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్)పై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టరు జీవనరాణి సూచించారు. తన కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యాధికారులు, పర్యవేక్షక సిబ్బంది, ఏఎన్ఎంలతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఒళ్లంతా తిమ్మిర్లు, కండరాల బలహీనత, పొత్తికడుపులో నొప్పి, జ్వరం, వాంతులు జీబీఎస్ లక్షణాలన్నారు. ప్రధానంగా కలుషిత ఆహారం, నీటి ద్వారా వైరస్ సోకుతుందన్నారు. ఈ వ్యాధి ప్రధానంగా పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం చూపుతుందని, నాడీ వ్యవస్థను వైరస్ దెబ్బతీసే ప్రమాదం ఉందన్నారు. లక్షణాలుంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్షలు నిర్వహించుకుని వెంటనే చికిత్స తీసుకోవాలని సూచించారు.

ఎన్నికల విధుల్లో పొరపాట్లు చేయొద్దు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అంబేద్కర్



విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో చాలా అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పొరపాటుకు ఆస్కారం ఇవ్వకూడదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అంబేడ్కర్ సూచించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పీవోలు, ఏపీవోలు, జోనల్ అధికారులకు కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం మొదటి విడత శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులను ఎన్నిసార్లు నిర్వహించినా ధీమాతో ఏ మాత్రం అలసత్వం చూపించకూడదన్నారు. ఎప్పటికప్పుడు నిబంధనలు మారుతూ ఉంటాయని, కొత్త ఆదేశాలు వస్తుంటాయని, వాటిన్నింటినీ చదవి అర్థం చేసుకోవాల్సి ఉంటుందని సూచించారు. సొంత నిర్ణయాలు పనికి రావని చెప్పారు. బ్యాలెట్ పత్రాల ద్వారా జరిగే ఎన్నికలకు , ఈవీఎంల ద్వారా జరిగే ఎన్నికలకు మధ్య కొన్ని తేడాలు ఉంటాయని, వీటిని ప్రతి ఒక్కరూ గ్రహించాలని సూచించారు. ఎన్నికల సామగ్రి తీసుకునే దగ్గర నుంచి, ఓటింగ్ పూర్తి చేసి తిరిగి అప్పగించే వరకూ పాటించాల్సిన నిబంధనలపై సంపూర్ణం అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. రీపోలింగ్‌కు అవకాశం ఇవ్వకుండా పోలింగ్‌ను పూర్తిచేయాలన్నారు. డీఆర్‌వో ఎస్.శ్రీనివాసమూర్తి సందేహాలను నివృత్తి చేశారు. సీపీవో బాలాజీ ఎన్నికల శిక్షణ నోడల్ అధికారిగా వ్యవహరిస్తూ పవర్ పాయింట్ ద్వారా వివరించారు.

ఇక వదలరు



- ట్రాఫిక్ నియమాలు పాటించాల్సిందే..
- ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు, కేసులు
- 1 నుంచి నిబంధనలు కఠినంగా అమలు

6లో

ఏయూ వీసీగా రాజశేఖర్

- ఐఐటీ ప్రొఫెసర్‌ను నియమించిన ప్రభుత్వం
- స్వస్థలం కె.కోటపాడు మండలం ఎ.కోడూరు
- 2002లో యంగ్ సైంటిస్ట్ అవార్డు

6లో



గ్రామాలకు 24 గంటలూ త్రీఫేజ్




- వ్యవసాయ పంపుసెట్లకు ప్రత్యేక లైన్
- జిల్లాకు రూ.రూ.83.92 కోట్లు మంజూరు
- తొమ్మిది మండలాల్లో పనులు ప్రారంభం

రాజాం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వ్యవస్థలో మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇక నుంచి 24 గంటలూ గ్రామాలకు సైతం త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో టౌన్ ఫీడర్లకు తప్పించి ..గ్రామీణ ప్రాంతాలకు కేవలం తొమ్మిది గంటలు మాత్రమే త్రీఫేజ్ విద్యుత్ సరఫరా వస్తోంది. దీనికి కారణం వ్యవసాయానికి సంబంధించి ప్రభుత్వం ఉచితంగా రోజుకు తొమ్మిది గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తోంది. అయితే ఇందుకోసం ప్రత్యేక విద్యుత్ లైన్లు లేవు. తొమ్మిది గంటలు త్రిఫేజ్ ఇచ్చి తరువాత సింగిల్, డబుల్ ఫేజ్‌ను కొనసాగిస్తూ వస్తోంది. దీనివల్ల లోవోల్టేజీ సమస్య తలెత్తుతూ వస్తోంది. నాణ్యమైన విద్యుత్ సరఫరా కాకుండా పోతోంది. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఆర్డీఎస్ పథకం కింద అన్ని గ్రామాలకు త్రీఫేజ్ ప్రత్యేక లైన్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. జిల్లాకు రూ.83.92 కోట్లు మంజూరు చేసింది. 2027 నాటికి పనులు పూర్తిచేయనున్నారు. త్రీఫేజ్ వల్ల నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది.

గ్రామాలకు వేరుగా లైన్లు

ఆర్డీఎస్ పథకంలో భాగంగా వ్యవసాయ పంపుసెట్లు ఎక్కువగా ఉన్న గ్రామాలకు ప్రత్యేక విద్యుత్ లైన్లను ఏర్పాటుచేస్తారు. కేవలం పొలాలకు ప్రత్యేక లైన్ ఏర్పాటుచేసి గ్రామాలను వేరు చేస్తారు. సబ్‌స్టేషన్ నుంచి గ్రామాలకు వెళ్లే ప్రత్యేక లైన్లకు త్రీఫేజ్ ఇస్తారు. పొలాలకు వెళ్లే లైన్‌కు తొమ్మిది గంటల పాటు మాత్రమే త్రీ ఫేజ్ ఇచ్చి.. తరువాత నిలిపివేస్తారు. జిల్లాలో 27 మండలాల్లో 154 గ్రామీణ మిక్స్‌డ్ 11కేవీ (మిగతా 8వ పేజీలో..)



అపరాలకు ఆసరా ఏదీ?



- ప్రభుత్వం కొనుగోలు చేయక దళారులే దిక్కు
- అకాల వర్షాలతో కొంత నష్టం
- గిట్టుబాటు ధర లేక నిరాశలో రైతులు



విజయనగరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అపరాలు పండించే రైతుకు ఆసరా కరువు అవుతోంది. పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయక దళారులే దిక్కు అవుతున్నారు. వారిచ్చిందే ధర కావడంతో ఈ ఏడాది మినుములు, పెసర పంటలతో లాభం లేకపోయింది. అకాల వర్షాలకు కొంత పంట నష్టపోగా గిట్టుబాటు ధర లేక లాభం రాని పరిస్థితి.

గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో కురిసిన అకాల వర్షాలకు రైతులు మినుములు, పెసర పంటలను చాలా వరకు కోల్పోయారు. వర్షాలు తగ్గిన తరువాత కొన్నిచోట్ల తిరిగి విత్తనాలు జల్లుకుని అపరాలు సాగుచేశారు. పంట చేతికి అందినప్పటికీ గిట్టుబాటు ధర లేకుండా పోయింది. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మినుము, పెసర పంటలను కొనుగోలు చేసినట్టయితే రైతులకు పూర్తిగా కాకపోయినా ఎంతో కొంత మేలు జరిగేది. అయితే ప్రభుత్వం నిర్దేశించిన గ్రేడింగ్ లేదంటూ మార్క్‌ఫెడ్ ముందుకు రావడం లేదు. దీంతో రైతాంగం దిక్కుతోచని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తున్నారు. దళారులు వారికి నచ్చిన ధర ఫిక్స్ చేసుకుని సిండికేట్‌గా మారి కొనుగోలు చేస్తున్నారు. ప్రత్యామ్నాయం లేక రైతులు పంటను వారికే అప్పగిస్తున్నారు.

జిల్లాలో పెసర పంటను 26,070 ఎకరాల్లో వేశారు. 6,387 మెట్రిక్ టన్నుల దిగుబడి రావాల్సి ఉంది. మినుములు 47,565 ఎకరాల్లో (మిగతా 8వ పేజీలో..)

రైతాంగాన్ని ఆదుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలి. మార్క్‌ఫెడ్ ద్వారా మినుములు, పెసలు కొనుగోలు చేయాలి. నవంబరు, డిసెంబరు నెలల్లో అకాల వర్షాలకు కొంత పంటను నష్టపోయారు. మిగతా పంట అయినా మంచి ధరకు విక్రయిస్తే కాస్త అయినా ఊరట కలుగుతుంది. ఆ వైపుగా ప్రభుత్వం వెంటనే స్పందించాలి. ఈ సమస్యను కలెక్టర్‌కు వివరించాం.

- బి.రాంబాబు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి



ఒత్తిడికి దూరమైతే.. విజయం మీదే!



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఏపీవో చిన్నబాబు

పరీక్షలకు సిద్ధమవ్వండి: ఏపీఓ

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సంసిద్ధం కావాలని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు సూచించారు. మంగళవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను డీడీ అన్నదొరతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థినులకు పాఠ్యాంశాల వారీగా ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చునని సూచించారు. విద్యార్థినులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. మెనూ అమలు తీరు, ఆరోగ్యం వంటి అంశాలపై విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని ఆర్వో ప్లాంట్, డార్మెటరీలను పరిశీలించారు. ఆయనతో పాటు హెచ్‌డబ్ల్యూవో పి.అమల తదితరులు ఉన్నారు.

- పరీక్షల సమయంలో భయం వద్దు
- అతిగా తినవద్దు
- ఆరోగ్యాన్ని కాపాడుకోవడమూ అవసరమే
- విద్యార్థులకు నిపుణుల సూచనలు

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇది పరీక్షల సమయం. పది, ఇంటర్ విద్యార్థులకు కీలక సమయం. త్వరలో పరీక్షలు జరుగనున్నాయి. ఈ సమయంలో సానుకూల దృక్పథంతో ఉండాలి. అయిపోయిన పరీక్షల గురించి అస్సలు ఆలోచించకూడదు. రాయబోయే పరీక్షపైనే మనసు పెట్టాలి. మానసిక ప్రశాంతత కోసం ఉదయం నిద్ర లేచిన వెంటనే, రాత్రి పడుకోబో యే ముందు ధ్యానం చేస్తే ఎంతో ప్రయోజనం. వేపుళ్ల తగించి, ఆకుకూరలు తీసుకోవాలి. రాత్రి భోజనం ఎక్కువగా తీసుకుంటే త్వరగా నిద్ర వస్తుంది. కనుక తక్కువ తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

గుర్తుకు తెచ్చుకునేలా..

పరీక్షల్లో ఒక ప్రశ్నకు సమాధానం రాస్తున్నప్పుడు కొన్ని సబ్‌హెడ్డింగ్స్ రాయాల్సి ఉంటుంది. చదివేటప్పుడు అన్నీ గుర్తు ఉన్నట్లు ఉంటుంది. రాసేటప్పుడు కొన్నే గుర్తుకు వస్తాయి. ఆ సమయంలో ఒత్తిడికి గురైతే నిరాశ చెంది.. తర్వాత ప్రశ్నలకు జవాబులు రాయలేం. ఇందుకు కారణం మెదడును సరైన రీతిలో వినియోగించుకోకపోవడం. జ్ఞాపకశక్తికి సంబంధించిన విధానాలను పాటించకపోవడం. పరీక్ష రాస్తుండగా గుండె వేగంగా కొట్టుకోవడం, కాళ్లు, చేతులకు చెమటలు పట్టడం, మెడ, తలనొప్పి, కంగారు పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవన్నీ చదవాల్సిన విధానంలో చదవకపోవడం వల్ల కలిగే అనర్థాలు. ఒక పాఠ్యాంశానికి సంబంధించిన వివరాలు మూలాల నుంచి నేర్చుకోకపోతే తర్వాత చదివేవి అంతగా జ్ఞప్తికి రావు. పాఠ్యాంశాన్ని పూర్తిగా అవగాహన చేసుకొని... ప్రశ్నలకు సమాధానాలు నేర్చుకోవాలి. కొత్త ప్రశ్నలు ప్రస్తుతం చదవకూడదు. గతంలో చదివిన ప్రశ్నలను మాత్రమే చదివితే ప్రయోజనం ఉంటుంది.

బృంద చర్చలతో ఎంతో మేలు..

చదివిన అంశాలు పరీక్ష రాసే సమయంలో గుర్తుండాలంటే కొన్ని మెలకువలు పాటించాలి. పాఠాలు బాగా అర్థం చేసుకుని చదవాలి. ముగ్గురు లేక నలుగురు విద్యార్థులు బృందంగా కలిసి చదువుకోవాలి. ఒక్కొక్కరు విభిన్న ప్రశ్నలను చదివి వాటిని మిత్రులతో చర్చించుకోవాలి. దీనివల్ల ఒకే సమయంలో అనేక ప్రశ్నలు చదివినట్లవుతుంది. మరిచిపోయే అవకాశమూ ఉండదు. మంచి మార్కులు రావాలంటే అందుకు ఒక్కటే మార్గం. పాఠ్యాంశాలను అర్థం చేసుకోవాలే తప్ప బట్టీ పట్టే విధానం సరికాదు. పరీక్షల వేళ డీలా పడిపోతే సంవత్సరమంతా చదివింది వృథా అవుతుంది.

పరీక్షలకు ముందు ఏం చేయాలంటే...

- పరీక్షలకు ముందు అతిగా ఆహారం తీసుకోవడం... అసలు ఆహారం తీసుకోకపోవడం ఈ రెండు కూడా ప్రమాదకరమే. మెదడుకు గ్లూకోజ్ అవసరం. అందుకే అల్పాహారం తప్పక తీసుకుని పరీక్షకు వెళ్లాలి.
- అవసరమైన స్థాయిలో వ్యాయామం చేస్తే అది జ్ఞాపక శక్తిని పెంచుతుంది. వివిధ రకాల వ్యాయమాలు చేయడం ద్వారా శరీరానికి చెమటలు పట్టేలా చేయాలి. కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్‌లు పరీక్షల కాలంలో మానేస్తే మంచిది. వీటిలోని కొన్ని పదార్థాలు జ్ఞాపకశక్తిపై ప్రతికూలంగా పనిచేస్తాయి.
- చదువుతున్నప్పుడు 45 నిమిషాలకొకసారి 5 లేదా 10 నిమిషాలు విరామం ఇవ్వాలి. ఆ సమయంలో ఆకాశం వైపు చూస్తూ ముందుకు, వెనక్కు పది అడుగులు వేయాలి. దీనివల్ల ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుంది.
- పరీక్షల్లో రాబోయే ప్రశ్నలు సంవత్సరం పొడవునా తరగతుల్లో మీకు చెప్పినవే. మీరు చదివినవే. మొత్తం మీద మీ సిలబస్ నుంచే వస్తాయని విద్యార్థులకు ఉపాధ్యాయులు ధైర్యం చెప్పాలి.
- పరీక్షా కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు గుడ్లు, పాలు, కూరగాయలు వంటి సాత్వికాహారం తీసుకోవాలి. మాంసాహారానికి సాధ్యమైనంత దూరంగా ఉండాలి. దృఢమైన మనస్సుతో ముందుకు వెళ్లాలి.

2 గంటల ముందు చర్చలు వద్దు..

చదివే ముందు ఎవరితోనూ గొడవలు పెట్టుకోవద్దు. వాదనలు అసలే వద్దు. ప్రారం భించాక టీవీ చూడకూడదు. చదివే క్రమంలో రెండు ఇష్టమైన సబ్జెక్టుల మధ్య ఒక కష్టమైన సబ్జెక్టు చదవాలి. పరీక్షలకు 2 గంటల ముందు సబ్జెక్టుపై చర్చలు వద్దు. దించిన తల ఎత్తకుండా రాయ కూడదు. అప్పుడప్పుడు రెండు నిమిషాల సేపు తలెత్తి ఉపశమనం పొందాలి. ఆ సమయంలో ఏ ప్రశ్న అడిగారనేది సరిగ్గా అర్థం చేసుకుని జవాబు రాయాలి. కాగితంపై మరీ గట్టిగా రాయకూడదు. దీనివల్ల చెయ్యి నొప్పి వచ్చి సరైన వేగంగా రాయలేకపోతారు. కొత్త పెన్ను వద్దు. అలవాటు ఉన్న పెన్నుతోనే రాయలి. రెండు పెన్నులు ఒకే మాదిరివి దగ్గర ఉంచుకోవాలి.

ఒత్తిడికి లోను కావద్దు..

మనిషి జీవితమే ఓ యుద్ధం. ఆ యుద్ధంలో గెలుపే ధ్యేయంగా సాగాలి. ముఖ్యంగా యువత తమ లక్ష్యాన్ని చేరుకునేలా శ్రమించాలి. అందుకు తగ్గ ఆత్మస్థైర్యం పొందాలి. ధైర్యంతో అడుగు ముందుకు వేయాలి. పరీక్ష అంటే కొందరు ఆందోళనకు లోనవుతారు. తల్లిదండ్రులు, విద్యాలయాల్లో గురువులు పిల్లలకు ధైర్యం చెప్పాలి. కష్టమైన సబ్జెక్టులు ఎక్కు వ సమయం, సులభమైన వాటికి తక్కువ సమయాన్ని విభజించుకోవాలి.

ఆందోళనకు గురికావద్దు..

విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా పరీక్షలకు సిద్ధమవ్వాలి. ఈ ఏడాది పది పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు రెండుసార్లు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఈ నెల 20వ తేదీ వరకూ మొదటి విడత ప్రీఫైనల్ పరీక్షలు జరుగుతున్నాయి. మార్చి 3 నుంచి 15వ తేదీ వరకూ రెండో విడత నిర్వహిస్తాం. విద్యార్థులకు మెటీరియల్ అందించాం. పాఠశా లలో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంట ల వరకూ స్టడీ అవర్స్ నిర్వహిస్తు న్నాం. సెలవుల సమయంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహి స్తున్నాం. ఈ సమయంలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నాం

-టి.సన్యాసిరాజు, ప్రధానోపాధ్యాయుడు, బొండపల్లి

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి..



పదో తరగతి విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. ఆందోళనకు గురికావద్దు. పరీక్షలకు సంబంధించి 100 రోజుల కార్యాచరణ ద్వారా పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఉపాధ్యాయులు కొందరు విద్యార్థులను దత్తత తీసుకుని వారికి సూచనలు ఇస్తున్నారు. ఉదయం ఎన్ని గంటలకు నిద్ర లేచి చదుతున్నారు? రాత్రి ఎంత వరకూ చదువుతున్నారు? అనే విషయమై ఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుంటున్నారు. ఈ నెల 22న డిపార్టు మెంట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. మార్చి 17 నుంచి 31 వరకూ రెగ్యులర్, 17 నుంచి 28వరకూ ఓపెన్ స్కూల్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయి. రెగ్యులర్, ప్రైవేటు కలిసి జిల్లాలో 23,765 మంది విద్యార్థులు 119 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు.

-మాణిక్యం నాయుడు, జిల్లా విద్యాశాఖ అధికారి

సిరిమాను చెట్టుకు మంత్రి పూజలు



సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సుమారు 14 సంవత్సరాల విరామం తర్వాత నిర్వహించనున్న సాలూరు గ్రామదేవత శ్యామలాంబ అమ్మవారి పండుగకు ఎంపిక చేసిన సిరిమాను చెట్టుకు రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మంగళవారం శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మే నెల 18, 19, 20 తేదీల్లో అమ్మవారి పండుగను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పైడిమాంబ ఆలయంలో చండీ హోమం

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సిరుల తల్లి పైడిమాంబ చదురు, వనంగుడుల్లో మంగళవారం ఉదయం చండీహోమాన్ని అర్చకులు నిర్వహించారు. మంగళవారం పైడిమాంబకు అత్యంత ప్రీతిపాత్రమైన రోజు కావడంతో దేవాలయ అర్చకులు, సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి.. ఈ హోమంలో పాల్గొన్నారు. అంతకుముందు పైడిమాంబను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రకాల పిండివంటలు, పండ్లను నైవేద్యంగా సమర్పించారు. ఈ పండ్లను, పిండి వంటలను దర్శనానికి వచ్చే భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు..

పైడిమాంబ చదురుగుడికి ఆనుకుని ఉన్న వేదిక వద్ద మంగళవారం సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇవి భక్తులను, ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విజయనగరానికి చెందిన పతివాడ త్రినాథస్వామి బృందం అన్నమయ్య సంకీర్తనలు, సినీ భక్తి పాటలు ఆలపించారు.



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి



చండీహోమం చేస్తున్న అర్చకులు

ఇక వదలరు!

- ట్రాఫిక్ నియమాలు పాటించాల్సిందే..
- ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు, కేసులు
- 1 నుంచి నిబంధనలు కఠినంగా అమలు



వాహన పత్రాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మోటారు వాహన చట్టంలోని నిబంధనలు పక్కాగా అమలు చేసే దిశగా పోలీసు, రవాణా శాఖలు అడుగులు వేయబోతున్నాయి. వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నాయి. హెల్మెట్, సీటు బెల్టులు తప్పని సరిగా ధరించేలా చూడాలని ప్రయత్నిస్తున్నాయి. లేదంటే భారీ స్థాయిలో జరిమానాలు.. శిక్షలు విధించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

రాజాం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి)

ఇకపై ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతామంటే కుదరదు. హెల్మెట్ తప్పనిసరి. ఆపై అన్నిరకాల ధ్రువపత్రాలు ఉండాలి. నిబంధనలు పాటించాలి. లేకుంటే భారీగా జరిమానాలు చెల్లించక తప్పదు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం మార్చి 1 నుంచి గట్టిగానే చర్యలకు దిగనుంది. మోటారు వాహన చట్టాలను మరింత కఠినంగా అమలు చేసేందుకు రవాణా, పోలీసు శాఖలు సిద్ధమవుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాల మోత మోగించనున్నారు. చట్టాన్ని పట్టించుకోకపోతే లైసెన్స్‌లనూ రద్దు చేయనున్నారు. ఇందుకు సంబంధించి పోలీసు శాఖ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ప్రతి వాహనదారుడి వివరాలు అందులో ఉంటాయి. గతంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారు... చలానా కట్టనివారి వివరాలు ఇట్టే అందుబాటులోకి వస్తాయి. దానికి అనుగుణంగా జరిమానాలు విధిస్తారు.

● ఇప్పటి వరకూ ఇలా..

గత ఏడాది జిల్లా వ్యాప్తంగా ఈ చలానాకు సంబంధించి 98,619 కేసులు నమోదైనట్టు గణాంకాలు చెబుతున్నాయి. హెల్మెట్ లేకుండా ప్రయాణానికి సంబంధించి 65,350, మైనర్ల డ్రైవింగ్ 3,420, మితిమీరిన వేగం 2,570, సీటు బెల్ట్ ధరించకపోవడంపై 245, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ 1,529, నంబరు ప్లేట్లు లేకపోవడం, నిబంధనలు పాటించనివి 3,678 కేసులు నమోదు చేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణానికి ఇప్పటి వరకూ రూ.135 జరిమానా వేసేవారు. ఇక నుంచి రూ.1000 కట్టాల్సిందే. లైసెన్స్ లేకుండా బండి నడిపితే రూ.10 వేలు వసూలు చేస్తారు. విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ సిబ్బందితో వాగ్వాదానికి దిగితే కేసులు నమోదు చేస్తారు. 90 రోజుల్లో జరిమానా కట్టకపోతే వాహనాన్ని సీజ్ చేస్తారు.

● ఇక నుంచి ఇలా..

హెల్మెట్ లేకుంటే రూ.1000, వెనుక కూర్చున్న వారు హెల్మెట్ ధరించకపోతే రూ.1000, వాహనానికి ఇన్సూరెన్స్ లేకపోతే రూ.1000, రెండోసారి పట్టుబడితే రూ.2000, భారీ సైలెన్సర్లతో సౌండ్ పొల్యూషన్‌కు పాల్పడితే రూ.2000, అదే రెండోసారి దొరికితే రూ.4000, పరిమితికి మించి వాహనాల్లో ఎక్కించుకుంటే మనిషికి రూ.200 వంతున జరిమానా విధిస్తారు. మైనర్లు డ్రైవింగ్ చేసి పట్టుబడితే రూ.1000, నిషేధం ఉన్న ప్రాంతాల్లో పార్కింగ్ చేస్తే రూ.1500 నుంచి రూ.2000, బైక్ రేసుల్లో పాల్గొంటే రూ.5000, రెండోసారి అందులో దొరికితే రూ.10 వేలు, తాగి వాహనం నడిపితే మూడు నెలల జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తారు. దీనిని అమలు చేసేందుకు పోలీసు, రవాణా శాఖలు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

● ప్రజలు సహకరించాలి..

ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు తప్పకుండా హెల్మెట్లు ధరించాలి. కార్లపై వెళ్లేవారు సీటు బెల్టు పెట్టుకోవడం తప్పనిసరి. ఎవరైనా నిబంధనలు పాటించకపోతే భారీ జరిమానాలు, జైలుశిక్ష తప్పదు. హైకోర్టు ఆదేశాల మేరకు జరిమానాలు, కేసులు నమోదు చేస్తాం. ప్రజల బాగుకోసమే ఈ ప్రయత్నం. అందుకే ప్రజలు సహకరించాలి. ట్రాఫిక్ నిబందనలు పాటించాలి.

-కె.అశోక్‌కుమార్, సీఐ, రాజాం

ఏయూ వీసీగా రాజశేఖర్

- ఐఐటీ ప్రొఫెసర్‌ను నియమించిన ప్రభుత్వం
- స్వస్థలం కె.కోటపాడు మండలం ఎ.కోడూరు
- 2002లో యంగ్ సైంటిస్ట్ అవార్డు



విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతిగా ఖరగ్‌పూర్ ఐఐటీలో గణిత శాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తున్న ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ నియమితులయ్యారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదేశాల మేరకు ఉన్నత విద్యా శాఖ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఏయూ వీసీగా ప్రొఫెసర్ రాజశేఖర్ మూడేళ్లపాటు కొనసాగనున్నారు. వీసీ పోస్టు కోసం వర్సిటీకి చెందిన సుమారు పది మంది సీనియర్ ప్రొఫెసర్లు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు సాగించారు. అయితే, ఐఐటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రాజశేఖర్ వైపు ప్రభుత్వం మొగ్గు చూపింది. అందుకు అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుంది. దేశంలోనే పురాతన విశ్వవిద్యాలయాల్లో ఒకటైన ఏయూ మరో ఏడాదిలో శతాబ్ది ఉత్సవాలకు సిద్ధమవుతోంది. అంతటి చరిత్ర కలిగిన విశ్వవిద్యాలయం దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల జాబితాలో చోటుదక్కించుకోవాలనేది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్‌ల లక్ష్యం. అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుని, అమలు చేయడానికి బయటి ప్రొఫెసర్ అయితే బాగుం టుందన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుందంటున్నారు. విద్యా బోధనలో కీలక మార్పులు చేయడంతో పాటు పరిశోధనలకు పెద్దపీట వేసే ఆలోచనలో పాలకులు ఉన్నారు. గడిచిన ఐదేళ్లలో యూనివర్సిటీలో రాజకీయాలు బాగా పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో బయటి నుంచి సీనియర్ ప్రొఫెసర్‌ను తీసుకు రావడం ద్వారా వాటన్నింటికీ చెక్ చెప్పడంతో పాటు వర్సిటీ పాలనను గాడిలో పెట్టవచ్చునని ప్రభుత్వం భావించినట్టు చెబుతున్నారు. తాజా నిర్ణయంతో వర్సిటీ ప్రతిష్ఠ ఇనుమడిస్తుందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. రాజకీయాలకు, వ్యక్తిగత అజెండాలకు దూరంగా వర్సిటీ పాలన సాగేందుకు అవకాశం ఉంటుందని విశ్లేషిస్తున్నారు.

ఇదీ నేపథ్యం..

నూతన వీసీగా నియమితులైన ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ స్వస్థలం అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఎ.కోడూరు. తండ్రి ఉద్యోగరీత్యా వీరి కుటుంబం సింహాచలంలో స్థిరపడింది. రాజశేఖర్ ఒకటి నుంచి ఏడో తరగతి వరకు సింహాచలంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో, ఏడు నుంచి పదో తరగతి వరకూ సెయింట్ ఆంథోనీ స్కూల్‌లో, ఇంటర్, డిగ్రీ (మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులతో) ఏవీఎన్ కాలేజీలో చదువుకున్నారు. అనంతరం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎమ్మెస్సీ (అప్లైడ్ మ్యాథమెటిక్స్), ఎంఫిల్ చేసిన ఆయన... 1997లో అక్కడే పీహెచ్‌డీ పూర్తిచేశారు. ప్రొఫెసర్ రాజశేఖర్‌కు 27 ఏళ్ల బోధన, పరిశోధన అనుభవం ఉంది. ఇప్పటివరకూ ఆయన వద్ద 14 మంది డాక్టరేట్ డిగ్రీలు అందుకున్నారు. మరో నలుగురు పీహెచ్‌డీ పూర్తి చేస్తున్నారు. ఇప్పటి వరకూ ఆరు పరిశోధన ప్రాజెక్టులు పూర్తిచేశారు. 112 రీసెర్చ్ పబ్లికేషన్స్ వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. 2002లో యంగ్ సైంటిస్ట్ అవార్డ్ ఇన్ మ్యాథమెటికల్ సైన్సెస్‌ను ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ అందించింది. ఈ అవార్డును అప్పటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చేతుల మీదుగా అందుకున్నారు. వీటితో పాటు అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి అవార్డులను, గోల్డ్ మెడల్స్‌ను రాజశేఖర్ అందుకున్నారు.

కీలక బాధ్యతలు..

ప్రొఫెసర్ రాజశేఖర్ అనేక కీలక బాధ్యతలను నిర్వర్తించారు. గేట్-2014 ఆర్గనైజింగ్ చైర్మన్‌గా, 2014లో గేట్ అకడమిక్ స్టాండింగ్ కమిటీ కన్వీనర్‌గా, 2018-19లో ఐఐటీ ప్లేస్‌మెంట్ కమిటీ కన్వీనర్‌గా, 2020లో జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ సభ్యుడిగా బాధ్యతలను నిర్వర్తించారు. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్‌గా, ప్లానింగ్ అండ్ కో-ఆర్డినేషన్ విభాగం డీన్‌గా, కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ డీన్‌గా, టెక్నాలజీ విజన్-2047 వర్క్‌షాప్ చైర్మన్‌గా, ఐఐటీ ఖరగ్‌పూర్ విజన్-2030 డాక్యుమెంట్ కమిటీ చైర్మన్‌గా, కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ చైర్మన్‌గా సేవలు ఆయన అందించారు.

అత్యవసర వేళల్లో ఎక్కడికెళ్లేది?

●ప్రభుత్వ కార్యాలయాల్లో కానరాని మరుగుదొడ్లు ●ఉద్యోగినిలకు తప్పని అగచాట్లు



మండల విద్యా వనరుల కేంద్రంలో మరుగుదొడ్ల దుస్థితి

వంగర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లోని మహిళా ఉద్యోగులు సరైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మించకపోవటంతో అవస్థలు తప్పడంలేదు. మండల కేంద్రంలో మండల విద్యా వనరుల కేంద్రం, మండల పరిషత్ కార్యాలయం, వెలుగు కార్యాలయం, పోలీసుస్టేషన్‌తో పాటు పలు ప్రధాన కార్యాలయాల్లో పరిస్థితి ఒకేలా ఉంది. దీనిపై యంత్రాంగం స్పందించాల్సి ఉంది.

గజపతినగరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాలు మౌలిక సదుపాయాలకు దూరంగా ఉన్నాయి. దీంతో ఇటు ఉద్యోగులు.. అటు వివిధ పనులపై వచ్చే వారు అవస్థలకు గురవుతున్నారు. మండలంలోని 22 గ్రామ సచివాలయాలు ఉన్నప్పటికీ రెండు సచివాలయాల్లోనే వసతులు సరిగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి రూ.3 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు రన్నింగ్ వాటర్ పనులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే 7 సచివాలయాల్లో పనులు పూర్తి చేయగా 13 సచివాలయాల్లో పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇకనైనా పనుల పూర్తికి చర్యలు చేపట్టాల్సి ఉంది.



పురిటిపెంట సచివాలయంలో మరుగుదొడ్లు ఇలా..



రూ.లక్ష విరాళం అందజేస్తున్న సర్పంచ్‌లు

అన్నసమారాధనకు రూ.లక్ష విరాళం

పూసపాటిరేగ, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకొప్పెర్లలో పార్వతమ్మ అమ్మవారి జాతర సందర్భంగా నిర్వహించనున్న అన్నసమారాధనకు జనసేన మండల నాయకులు కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు, గోవిందపురం సర్పంచ్ బాల అప్పలరాజు రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఆ మొత్తాన్ని మంగళవారం కమిటీ ప్రతినిధులకు వారు అందజేశారు. ఈ సందర్భంగా జాతర కమిటీ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం అన్నసమారాధన నిర్వహించనున్నామని కమిటీ తెలిపింది.

రెండు రోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరివిడి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19,20 తేదీలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు గరివిడి 220 కేవీ సబ్‌స్టేషన్ ఈఈ మారుతీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 160 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సర్క్యూట్ బ్రేకర్ పనులు నిర్వహిస్తుండడంతో రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

హైకోర్టు ఉత్తర్వుల మేరకే ఉపాధి పనులు

విజయనగరం కలెక్టరేట్ ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో ఉపాధి పనులు నిర్వహిస్తున్నామని డ్వామా పీడీ శారదదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని మూడు పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు ఉపాధి పనులను వెండర్లకు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఈనెల 5న తీర్పును వెలువరించిందన్నారు. పనులను వెండరులకు కేటాయించేటప్పుడు ఉపాధి హామీ చట్టంలోని సెక్షన్ 16 పరిధిలోని సబ్ సెక్షన్ (5), గ్రామీణాభివృద్ధి శాఖ 2022 మార్చి 31 జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం నడుచుకోవాలని ఆదేశించిందని పీడీ వివరించారు.

నెల్లిమర్ల కమిషనర్‌కు పదోన్నతి

నెల్లిమర్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్ కె.అప్పలరాజుకు పదోన్నతి లభించింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడి కమిషనర్ అప్పలరాజును విజయనగరం నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతిపై బదిలీ చేశారు. అలాగే నెల్లిమర్ల కమిషనర్‌లో అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేడు జాతర ప్రసాదాల తయారీకి టెండర్

రాజాం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాజంలో పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర మార్చి 9, 10, 11 తేదీల్లో నిర్వహించనున్న నేపథ్యంలో ప్రసాదాల కౌంటర్‌కు పులిహోర, లడ్డూ సప్లై చేసేందుకు బుధవారం టెండర్ల బాక్స్‌ను తెరవనున్నట్టు ఈవో మాధవరావు ఓ ప్రకటనలో తెలిపారు. పులిహోర 150 గ్రాముల ప్యాకెట్. లడ్డూ 80 గ్రాముల ప్యాకెట్ ఉండాలని నిర్ణయించామన్నారు.నాణ్యతాప్రమాణాలకు అనుగుణంగా తక్కువకు టెండర్లు దాఖలు చేసిన వారికి టెండరు ఖరారు చేస్తామన్నారు.

కళాపరిషత్‌కు రూ.లక్ష విరాళం ప్రకటన

గరివిడి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గరివిడి నాటక కళాపరిషత్‌కు గరివిడి పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త మజ్జి నాగేశ్వరరావు రూ.లక్ష విరాళం ప్రకటించారు. నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో గరివిడిలో త్వరలో రాష్ట్రస్థాయి నాటక పోటీలు నిర్వహించనున్నారు. విరాళాలలో భాగంగా కళాపరిషత్ సభ్యులు శ్రీను, బమ్మిడి కార్తీక్ కుమార్. నాగేశ్వరరావును కలవడంతో ఆయన విరాళం ప్రకటించారు.

రూ.20 వేల సామగ్రి వితరణ

మెరకముడిదాం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకర్ర ప్రాథమిక పాఠశాలకు బాలమిత్ర ఫౌండేషన్ రూ.20 వేల విలువైన సామగ్రిని మంగళవారం అందజేసింది. ఎంఈవో చంద్రశేఖర్ చేతుల మీదుగా అందజేశారు.

చీపురుపల్లిలో సమస్యలు పరిష్కరించండి

● మంత్రి లోకేశ్‌కు కళా విజ్ఞప్తి



మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే కళా

చీపురుపల్లి/ గరివిడి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి నియోజకవర్గంలోని సమస్యలు తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే అమరావతిలో మంత్రి లోకేశ్‌ను మంగళవారం కలిసి నియోజకవర్గంలోని సమస్యలను వివరించారు. ముఖ్యంగా చీపురుపల్లి ప్రాంత రైతాంగానికి ఎంతో అవసరమైన ఆర్‌ఈసీఎస్ సంస్థను పునరుద్ధరించాలని కోరారు. అదే విధంగా నియోజకవర్గంలోని మూడు మండలాల ఆయకట్టుకు సాగు నీరందించే తోటపల్లి ప్రాజక్టుకు అనుసంధానంగా పిల్ల కాలువలు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. పలు గ్రామాలకు తారు రోడ్లు నిర్మించాలని, పాడైన రోడ్లకు మరమ్మతులు నిర్వహించాలన్నారు. జలజీవన్ మిషన్ పనులు సత్వరమే జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. గరివిడి పశు వైద్య కళాశాల విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని మంత్రి లోకేశ్‌కు విన్నవించారు. ఇందుకు మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

శంబరకు పోటెత్తిన భక్తజనం

●క్యూలైన్లు నిండిపోవడంతో ఎండలోనే నిరీక్షణ



అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు

మక్కువ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శంబర పోలమాంబ అమ్మవారి నాలుగో వారం జాతర మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు శంబర గ్రామానికి చేరుకున్నారు. చదురుగుడి, వనంగుడుల వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. దీనితో భక్తులు ఎండలోనే అమ్మవారి దర్శనం కోసం నిరీక్షించాల్సి వచ్చింది. వనంగుడి వద్ద అమ్మవారిని దర్శించుకొని అక్కడ ఉన్న వేపచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. గోముఖ నదీతీరాన అమ్మవారికి తలనీలాలు, కోళ్లు, చీరలు మొక్కులు చెల్లించుకున్నారు. వనంగుడి సమీప ప్రాంతంలో చెట్లకింద వంటావార్పు చేశారు. భక్తులకు అసౌకర్యం లేకుండా ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ ఏర్పాట్లు చేశారు. సాలూరు రూరల్ సీఐ రామకృష్ణ, మక్కువ ఎస్ఐ ఎం.వెంకటరమణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

కార్యకర్తలకు ఎమ్మెల్యే అభినందనలు



కార్యకర్తలతో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ యాప్ ద్వారా కూటమి ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లిన విజయనగరం నియోజకవర్గ పరిధిలోని మండల, నగరంలోని పలువురు కార్యకర్తలను మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అభినందించారు. వీరికి జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పంపిన పార్టీ జెండాలను వారికి అందజేసి వారిని ప్రశంసించారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న అవనాపు విక్రమ్

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో మార్చి 14న నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని జనసైనికులు, నాయకులు విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకుడు అవనాపు విక్రమ్ పిలుపునిచ్చారు. మంగళవారం బాలాజీనగర్‌లో జనసేన కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలోని జనసైనికులు, వీర సైనికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవుల కోసం కాకుండా పార్టీ కోసం పనిచేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వెంకటరావు, చక్రవర్తి, చంద్రశేఖర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో ఆక్రమణలను తొలగించండి

దత్తిరాజేరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చెరువులో ఆక్రమణలను తొలగించాలని మండలంలోని ఇంగిలాపల్లి సర్పంచ్ విజయలక్ష్మి మంగళవారం డీటీ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన సర్వేనెంబరు 179 లో 1.68 సెంట్ల ప్రభుత్వ భూమి, చెరువును రాళ్లబండి కిరణ్‌కుమార్ ఆక్రమించి కంచె వేశాడని ఫిర్యాదు చేశారు. గ్రామ ప్రజలు పల్లపు భూమికి వెళ్లకుండా అడ్డుకట్ట వేశాడని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గర్బాపు శ్రీను ఉన్నారు.

కార్మికులు, రైతులకు 'కూటమి' అండ

●మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికులు, రైతులకు అండగా ఉంటోందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధికి ప్రత్యేక ఆలోచన చేస్తున్నామని వివరించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆధ్వర్యంలో సుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగసంఘ నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగులకు రావల్సిన పీఎఫ్, గ్రాడ్యూటీ చెల్లింపులు యాజమాన్యం చేపట్టలేదన్నారు. దీంతో కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. దీనిపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం వైఫల్యాలతో రైతులు, కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉంగరాల శ్రీను, కనకరాజు, సూర్యనారాయణ, ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత: ఎస్పీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. మంగళవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ కోట జంక్షన్ నుంచి ప్రారంభమై ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రహదారి భద్రత నియమాలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయనే వాస్తవాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఏటా రహదారి ప్రమాదాలు కారణంగా సుమారు 400 మంది మరణిస్తుండగా, 900 మంది వరకూ క్షతగాత్రులు అవుతు న్నారని వివరించారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని రోటరీ క్లబ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు ఎం.వెంకటేశ్వరరావు, వినోద్, డాక్టర్ పద్మకుమారి, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధిపై తప్పుడు ప్రచారం తగదు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులను గుత్తేదారుల ద్వారా నిర్వహిస్తున్నారని వైసీపీ నాయకుల ఆరోపణలు టీడీపీ ఖండించింది. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో విజయనగరం, గజపతినగరం నియోజకవర్గాలకు చెందిన నగర, మండల నాయకులు మాట్లాడారు. ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, మార్తి నారాయణప్పుడు, కొండపల్లి భాస్కరరావు, మక్కువ శ్రీధర్, కోరాడ కృష్ణ, వి.స్వామినాయుడు, అల్లు విజయ్ కుమార్ మాట్లాడుతూ వాస్తవంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి పనులు నిబంధనలకు వ్యతిరేకంగా జరిగాయ న్నారు.అధికారం కోల్పోయిన తరువాత వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలకు సిద్ధమయ్యారన్నారు. దీన్ని టీడీపీ తరఫున ఖండిస్తున్నామన్నారు.

రెన్యువల్స్ తప్పనిసరి

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వాహన షోరూంల యాజమాన్యాలు క్రమం తప్పకుండా రెన్యువల్ చేయించుకోవాలని రవాణాశాఖ ఉప కమిషనర్ బి.మణికుమార్ స్పష్టం చేశారు. మంగళవారం రవాణాశాఖ కార్యాలయంలో షోరూంల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ నెలఖరు నాటికి రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌టీవో విమల, రవాణాశాఖాధికారులు వెంకటరావు, శివరామగోపాల్, ఉష ఉన్నారు.

హైవేపై ఆక్రమణల తొలగింపు

శృంగవరపుకోట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పట్టణంలో హైవేకు అనుకుని ఉన్న ఆక్రమణలకు సీఐ నారాయణమూర్తి మంగళవారం తొలగించే ఏర్పాటు చేశారు. ఆక్రమణల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున పంచాయతీ సహకారంతో పనులు చేయించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ గంగరాజు, సిబ్బంది ఉన్నారు.

చిన్నారి వైద్యానికి రూ.25 వేలు ఆర్థికసాయం

గుర్ల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గోషాడ గ్రామానికి చెందిన బదరి దామోదర్ బోన్ మ్యారోతో బాధపడుతున్న నేపథ్యంలో అమ్మసేవా సొసైటీ సభ్యులు మంగళవారం రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నిరుపేద కుటుంబం దాతల సాయం కోరడంతో వారు స్పందించారు.

ఆధార్ శిబిరం పరిశీలన

రాజాం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతికాపల్లి సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని ఎంపీడీవో వి శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఆయనతో పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

రైల్వే గూడ్స్ షెడ్డులో పనుల కోసం వాగ్వాదం



పనుల కోసం గొడవ పడుతున్న ఇరువర్గాలు

దత్తిరాజేరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగా కోమటిపల్లి రైల్వేస్టేషన్ వద్ద మంజూరైన గూడ్స్ షెడ్డులో కలాసీలుగా కొనసాగేందుకు మంగళవారం రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. సంబంధిత వ్యాగన్ కాంట్రాక్టర్ చొరవ తీసుకుని ఇరువర్గాల మధ్య సయోధ్య కుదర్చారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే బొబ్బిలిలో గూడ్స్ షెడ్డు ఇదివరకూ ఉండేది. అదనంగా 3వ లైన్ ఏర్పాటు చేయడంతో స్థలాభావంతో గూడ్స్ షెడ్డును కోమటిపల్లి రైల్వేస్టేషన్‌కు మార్చారు. దీంతో బొబ్బిలి రైల్వే స్టేషన్‌లోని కలాసీలు ఉపాధి కోసం కోమటిపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని గూడ్స్ షెడ్డుకు సోమవారం వచ్చారు. విషయం తెలుసుకున్న కోమటిపల్లి, వి.కృష్ణాపురం, పాచలవలస, వింధ్యవాసి మరడాం, వంగర గ్రామాల ప్రజలు గూడ్స్ షెడ్డు వద్దకువచ్చారు. ఇక్కడ పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. స్థానికేతరులైన బొబ్బిలి కలాసీలు ఇక్కడికి రావొద్దని చెప్పారు. దాంతో ఇరువర్గాల మధ్య కొద్దిపాటి వాగ్వివాదం జరిగింది. సుమారు 3 గంటల పాటు లోడింగ్ పనులు నిలిచిపోయాయి. విషయాన్ని గమనించిన వ్యాగన్ కాంట్రాక్టర్ అప్పారావు, వేణుగోపాలరావు, భాస్కరరావు తదితరులు ఇరువర్గాలతో చర్చించారు. వారి మధ్య సయోధ్య కుదిర్చారు. దీంతో లారీల్లో సరుకులు రైల్వే వ్యాగన్‌లోకి లోడింగ్ చేశారు.

రూ.పది నోటు కోసం గొడవ

●ఒకరికి తీవ్ర గాయాలు.. కేజీహెచ్‌కు తరలింపు

క్రైం న్యూస్

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల శివారు సీతంపేట పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం సాయంత్రం ఒక చెల్లని పది రూపాయిల నోటు విషయంపై జరిగిన చిన్నపాటి వాదన ఒక వ్యక్తి నడుం విరిగిపోయేలా చేసింది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్.కోటకు చెందిన నౌడాసరి ఈశ్వరరావు చెప్పుల దుకాణం నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఏదో పనిపై ఆయన ఎస్.కోట నుంచి ధర్మవరం వెళ్తూ దారిలో సీతంపేట పెట్రోల్‌బంక్ వద్ద తన ద్విచక్ర వాహనంలో పెట్రోల్ కొట్టించుకున్నాడు. అనంతరం బంక్‌లో పెట్రోల్ పోసిన వ్యక్తికి డబ్బులు ఇచ్చాడు. అందులో ఒక చెల్లని పది రూపాయిలు నోటు ఉండటంతో వేరే నోటు ఇవ్వాలని బంక్‌లో పనిచేసే వ్యక్తి అతడిని కోరాడు. ఏదోరకంగా మారుతుందని చెప్పడంతో ఇద్దరి మధ్య చిన్నపాటి వాదన జరిగింది. ఈ సమయంలో పెట్రోల్ పోసిన వ్యక్తి బండిపై ఉన్న ఈశ్వరరావును ఒక్క ఉదుటున తోసేయడంతో రైయిలింగ్ పైపుపై పడిపోయాడు. దాంతో నడుం భాగంతో పాటు కింద భాగంలో బలమైన తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. బాధితుడు ఈశ్వరరావు కిందపడటంతో నడుం దెబ్బతినడంతో పాటు తొడ దగ్గర ఎముక విరిగిందని వైద్యులు తెలిపారు. దాంతో ఈశ్వరరావు బంధువులు అక్కడికి చేరుకొని తోసిన వ్యక్తికి దేహశుద్ధి చేసినట్టు తెలిసింది. ఈ విషయంపై సీఐ నారాయణమూర్తి వివరణ కోరగా ఫిర్యాదు అందిందని తెలిపారు.

సారా విక్రయదారుడి అరెస్టు

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మెంటాడ మండలం ఓనిజీ గ్రామంలో సారా విక్రయిస్తున్న గుమడపు ముత్యాలును అదుపులోకి తీసుకుని ఐదు లీటర్ల సారాని స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఇందిరాదేవి తెలిపారు. తదుపరి చర్యలు నిమిత్తం గజపతినగరంలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించామన్నారు. దాడుల్లో ఎస్ఐ రాజశ్రీ, హెచ్‌సీ నాగేశ్వరరావు, ఈసీలు నాయుడు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

40 లీటర్ల సారా స్వాధీనం

మెంటాడ ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆండ్ర రిజర్వాయర్ సమీపంలో మంగళవారం నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 40 లీటర్ల సారాను ఆండ్ర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆండ్ర గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్టు ఆండ్ర ఎస్ఐ సీతారాం తెలిపారు.

21 నుంచి వాలీబాల్ పోటీలు

కొత్తవలస, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంటకాపల్లిలోని శారదా కర్మాగార ఆధ్వర్యంలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు సంబంధించి అంతర్ నియోజకవర్గ వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్టు కర్మాగార యాజమాన్య ప్రతినిధులు శంకర్, సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ పోటీలు కొత్తవలసలోని హైస్కూల్ గ్రౌండ్‌లో శారదా వాలీబాల్ లీగ్-2025 పేరిట ఈ నెల 21, 22 తేదీలలో నిర్వహిస్తామన్నారు. జట్లకు ఎటువంటి ప్రవేశ రుసుం లేదన్నారు. ప్రథమ బహుమతి కింద రూ.1.25 లక్షలు, ద్వితీయ, తృతీయ, చతుర్థి స్థానాలను వరుసగా రూ.60 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు చొప్పున నగదు అందజేస్తామన్నారు. ఆసక్తి గలవారు 9493549621, 9493548330 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

కొత్తవలస, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట నియోజక వర్గానికి సంబంధించి ప్రతిభ కలిగిన వాలీబాల్ క్రీడాకారులను ఎంపిక చేయడం కోసం బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎంపిక కార్యక్రమం జరుగుతుందని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిబాబు, కార్యదర్శి కేవీఏఎన్ రాజు ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21, 22 తేదీలలో శారదా కర్మాగారం ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్ నియోజకవర్గ వాలీబాల్ పోటీలకు సంబంధించి జట్టును ఎంపిక చేస్తామన్నారు.

రేపు కొత్తవలసలో క్యాంప్ కోర్టు

కొత్తవలస, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కరించేందుకు కొత్తవలసలోని వినియోగదారుల సేవాకేంద్రంలో గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు క్యాంప్ కోర్టు నిర్వహిస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ సురేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. తప్పుడు బిల్లులు, లో వోల్టేజీ, కొత్త కనెక్షన్లు వంటి సమస్యలను ఈ వేదిక దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

శతశాతం రాయితీపై మొక్కలు

లక్కవరపుకోట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వందశాతం రాయితీపై ఆయిల్ పామ్ మొక్కలు ప్రభుత్వం అందిస్తోందని ఉద్యానవన అధికారి పద్మ తెలిపారు. ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటల సాగుకు నాలుగేళ్లపాటు నిర్వహణ ఖర్చులు ప్రభుత్వమే ఇస్తుందన్నారు. మంగళవారం కల్లేపల్లి, రేగ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యలో అంగన్‌వాడీలు కీలకం



మాట్లాడుతున్న డీఈవో మాణిక్యంనాయుడు

రాజాం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలవుతున్న ఫౌండేషన్ స్కూల్ నిర్వహణలో అంగన్‌వాడీల పాత్ర చాలా కీలకమైనదని డీఈవో మాణిక్యం నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. చిన్నపిల్లలను స్కూల్‌కు వచ్చేలా చేయడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు. ఆయాలు చురుకైన పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్లు ఎంఈవో ప్రవీణ్‌కుమార్, వై.దుర్గారావు, హెచ్‌ఎం నాగయ్య, రిసోర్స్ పర్సన్‌లు వి.ఉషారాణి, కె.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

●గరివిడి: అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో యు.మాణిక్యంనాయుడు పిలుపునిచ్చారు. కొండపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతిపై శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు.

●గుర్ల: స్థానిక జడ్పీ ఉన్న పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీలకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని డీఈవో యు.మాణిక్యంనాయుడు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవోలు భానుప్రకాశ్, శ్రీనివాసరావు, సీడీపీవో ఆరుద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ

●నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఐసీడీఎస్ పీడీ రుక్సేనా బేగం పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలకు శిక్షణ ఉద్దేశాన్ని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు మూర్తి, ఈపు విజయ్‌కుమార్ ఉన్నారు.



సూచనలు చేస్తున్న ఏపీసీ రామారావు

●గజపతినగరం: పిల్లల శారీరక ఆరోగ్యం, ఎదుగుదలపై ప్రత్యేక దృష్టిసారించాలని జ్ఞానజ్యోతి ప్రోగ్రాం ట్రైనింగ్ అధికారి, ఏపీసీ రామారావు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్ లో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలకు పిల్లల సంరక్షణ, సమ్మిళితవిద్యా బోధనలపై అవగాహన కల్పించారు. ఎంఈవోలు విమలమ్మ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గోకులాల షెడ్లు పూర్తిచేయాలి: ఏపీడీ



మెట్టవలసలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న రమామణి

రామభద్రపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో మంజూరైన గోకులాల షెడ్లు నెలాఖరులోగా పూర్తిచేయాలని ఆ పథకం ఏపీడీ రమామణి సూచించారు. మంగళవారం రామభద్రపురంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షించారు.ఈసందర్భంగా ఎన్ని గోకులాలు మంజూర య్యాయి, ఎన్ని పూర్తిచేశారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వేసవిలో పని కల్పన, లేబర్ టార్గెట్‌పై కూడా సిబ్బందితో చర్చించారు.ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేతనాల విషయంలో కూడా ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా పనిచేయడం వల్ల వేతనం పెరిగే అవకాశం ఉందని, దీనిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. మ్యాజిక్ షోక్ ఫిట్స్ నిర్మాణాలపై ఏపీవో త్రినాథరావును ప్రశ్నించారు.

గరిష్ఠవేతనం పొందేలా పనులు

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మస్తర్ల ప్రకారం వేతనదారుల వివరాలను పనిప్రదేశాన్ని పరిశీలించాలని ఏపీడీ కె.రమామణి తెలిపారు. కొలతల ప్రకారం పనులు చేసుకుని గరిష్ఠ వేతనాన్ని పొందేలా పనుల అంచనాలు మేట్లకు అవగాహన కల్పించాలని సాంకేతిక సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని మెట్టవలస, ఎం.బూర్జవలసలో ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధిపనులపై అవగాహనకార్యక్రమాలు చేపట్టాలని కోరారు. సమస్యలను వేతనాలను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో పని జరుగుతున్న ప్రదేశంలో ఉపాధి హామీ కూలీలకు అందుతున్న సౌకర్యాలు నీడ, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ వంటి సదుపాయలపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మీపతిరాజు, క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.అలాగే గున్నతోటవలసలో నిర్మించిన మినీ గోకుల షెడ్‌ను ఏపీడీ కె.రమామణి పరిశీలించారు.

ఎంఎస్‌ఎంఈల కోసం ప్రోత్సాహకాలు

● బొబ్బిలి మునిసిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి



మాట్లాడుతున్న రామలక్ష్మి

బొబ్బిలి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపన(ఎంఎస్‌ఎంఈ) కోసం ముందుకొచ్చే వారి కోసం సర్వే నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనరు లాలం రామలక్ష్మి తెలిపారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో ఎంఎస్‌ఎంఈ కోసం సర్వేపై సమీక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు బొబ్బిలి మునిసిపాలిటీ పరిధిలో గల చిరువ్యాపారుల నుంచి పెద్ద వ్యాపారులు, పరిశ్రమలు నిర్వహిస్తున్న వారి వివరాల సేకరణ కోసం వార్డు సచివాలయాల సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇంతవరకు 1200 మంది ఎంటర్‌ప్రెన్యూర్స్ తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. నమోదు చేసుకున్న వారందరికీ ప్రభుత్వ పరంగా ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఇంకా మిగిలి ఉన్న వారంతా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను వినియోగించుకోవాలి



సోంపురంలో ఆధార్ నమోదును పరిశీలిస్తున్న రత్నం

రామభద్రపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను వినియోగించుకోవాలని ఎంపీడీవో రత్నం సూచించారు. మంగళవారం సోంపురంలో ఆధార్ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ శుక్రవారం వరకు జరగనున్న స్పెషల్ డ్రైవ్‌లో ఆరేళ్లలోపు వయస్సు ఉన్న పిల్లలు ఆధార్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఆధార్‌కార్డు లేకుండా ఏ ఒక్కరూ ఉండకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోందని తెలిపారు.

జీబీఎస్‌పై అప్రమత్తంగా ఉండాలి

● రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి శిరీష

రామభద్రపురం,ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి):గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్)పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఏఎల్‌జీ శిరీష సూచించారు.మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇన్‌ఫెక్షన్స్ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా జలుబు, దగ్గు వంటి వాటిపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ఈలక్షణాలు ఉంటే మజిల్స్ వీకై పక్షవాతంవచ్చే అవకాశం ఉందని,ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. కూల్‌డ్రింక్స్ తాగడం నిరోధించాలని, కొబ్బరి నీళ్లు, మజ్జిగ తాగాలని, శరీరక పరిశుభ్రత చూసుకోవాలన్నారు. జీబీఎస్‌పై ప్రజలు భయపడవలసిన అవసరం లేదని తెలిపారు.

పొరుగుసేవల ఏజెన్సీ రద్దు చేయాలి

● సీఐటీయూ నాయకుడు శంకరరావు

బొబ్బిలి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కాంట్రాక్టు కార్మికుల జీవితాల్లో ఎటువంటి ఎదుగూబొదుగూ లేకుండా ఆటంకంగా నిలుస్తున్న పొరుగుసేవల ఏజెన్సీని రద్దు చేయాలని సీఐటీయూ నాయకుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం బొబ్బిలిలోని వేణుగోపాలస్వామి ఆలయ మండపం దగ్గర కాంట్రాక్టు ఉద్యోగుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అనేక హామీలతో కాంట్రాక్టు ఉద్యోగులకు భరోసా ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు గుదిబండవంటి నిర్ణయాలు తీసుకునేందుకు ఉపక్రమిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి సిద్ధపడుతున్నట్లు తెలిపారు. బడ్జెట్ సమా వేశాల నేపథ్యంలో మార్చి ఐదో తేదీన చలో విజయవాడ కార్య క్రమం నిర్వహి స్తామని చెప్పారు. ఈనెలలో కౌన్సిల్ సమావేశం నాటికి ధర్నా చేపడతామని, వచ్చే నెల ఒకటో తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గౌరి, రామారావు, యుగంధర్, శంకరరావు పాల్గొన్నారు.

ఎఫ్‌ఎల్‌ఎన్‌పై అంగన్‌వాడీలకు శిక్షణ



మాట్లాడుతున్న వాసు

బొబ్బిలి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి పట్టణ, గ్రామీణ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల అన్ని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాలను మంగళవారం ప్రారంభించారు. పట్టణ టీచర్లకు పొట్టి శ్రీరాములు మునిసిపల్ హైస్కూల్‌లో, రూరల్ టీచర్లకు గొల్లపల్లి శ్రీ వేణుగోపాల మునిసిపల్ హైస్కూల్‌లో శిక్షణ ఎంఈవోలు చల్లా లక్ష్మణరావు, గొట్టాపు వాసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా ప్రీస్కూల్‌కు సంబంధించి ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్)లపై శిక్షణ నిర్వహిస్తున్నామని ఎంఈఓ వాసు తెలిపారు. ఐసీడీఎస్ పీవో జె.విజ యలక్ష్మి ఆధ్వర్యంలో ఒక్కో శిక్షణ శిబిరంలో నలుగురేసి రిసోర్స్‌పర్సన్లు చొప్పున శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతి రోజూ ఉదయం తొమ్మిదినుంచి సాయంత్రం వరకు రెండువందల మందికిపైగా టీచర్లకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు పీడీ విజయలక్ష్మి తెలిపారు.

తాగునీటి సమస్యపై చర్యలు

● జడ్పీ సీఈవో వెంకటరామన్



రికార్డులు పరిశీలిస్తున్న వెంకటరామన్

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని జడ్పీ సీఈవో వెంకటరామన్ తెలిపారు. మంగళవారం బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. తొలుత మండల స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూగ్రామసచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు, మండల పరిషత్ నిధుల నుంచి బోర్లు మరమ్మతులు చేసి సామర్థ్యం పెంచాలని, తాగునీటి పథకాల నిర్వహణ కూడా సక్రమంగా చేయాలని సూచించారు గ్రామ పరిధిలోని అంశాలు ఎప్పటికప్పుడు క్రోడీకరించి అభివృద్ధి పను లకు సంబంధించిన పనులు చేయాలని సూచించారు. అనంతరం డీఎల్‌డీవో కార్యాలయంకోసం అందుబాటులో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. తాత్కాలికంగా నిర్వహించడానికి మండల పరిషత్ కార్యాలయానికి మరమ్మతులు చేసి వినియోగించుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో ఎం.కిరణ్‌కుమార్, ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోపీఆర్డీ అల్లు భాస్కరరావు, డీఈఈ సీహెచ్‌వీ అప్పారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

తెంటు వివాహానికి చంద్రబాబుకు ఆహ్వానం

బొబ్బిలి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడు తన వివాహానికి హాజరు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఆహ్వానించారు. ఈమేరకు ఈనెల 23న విశాఖలో జరిగే వివాహానికి రావాలని తనకు కాబోయే భార్య డాక్టర్ మంతిని రేష్మతో కలిసి అమరావతిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లి ఆహ్వానపత్రికను లక్ష్మునాయుడు అందజేశారు. నూతన వధూవరులను చంద్రబాబు ఆశీర్వదించారు.అలాగే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కూడా కలుసుకొని ఆహ్వానపత్రికను అందజేశారు. వీరితోపాటు పలువురు ప్రభుత్వ పెద్దలు, పార్టీ నాయకులను వివాహానికి ఆహ్వానించారు.

చంద్రబాబునాయుడుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న తెంటు, డాక్టర్ రేష్మ



నేడు బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు

బొబ్బిలి,ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజాకళాశాల మైదానంలో బుధవారం ఉత్తరాంధ్ర స్థాయి జోనల్ బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్-2025 పోటీలు ఎమ్మెల్యే బేబీనాయన ప్రోత్సాహంతో నిర్వహిస్తున్నట్లు హనుమాన్ దీక్షా సేవాసమితి ప్రతినిధులు తెలిపారు. మంగళవారం బొబ్బిలి ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి ప్రతినిధులు ముగడ్ అనిల్, పొట్టేలు రవి మాట్లాడారు. మరాఠాయోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని బుధవారం బాడీబిల్డింగ్‌పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్రకు చెందిన ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 150 మంది బాడీ బిల్డర్లు పాల్గొంటామని సమాచారం ఇచ్చామని చెప్పారు. ఏడు విభాగాలలో పోటీలు నిర్వహిస్తుండగా, ప్రతీ విభాగానికి వేర్వేరుగా నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామని తెలిపారు.

స్టడీ మెటీరియల్ వితరణ

బాడంగి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎనిమిది మంది దివ్యాంగ విద్యార్థులకు అదే పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న గుంట కళ్యాణి పదో తరగతి స్టడీమెటీరియల్ సమకూర్చారు.ఈ మేరకు హెచ్‌ఎం దత్తి సత్యానారాయణ, ప్రత్యే కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, శంకరరావు, తిరుపతిరావు, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కంపోస్టు తయారీపై అవగాహన

రాజాం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రకార్యక్రమంలో భాగంగా ఈనెల 20వరకు ప్రత్యేకంగా గ్రామైక్య సమావే శాలు నిర్వహిస్తామని ఏరియా కోఆర్డినేటర్ చిరంజీవి తెలిపారు. గ్రామసంఘం సమావే శంలో సెర్ప్, డీఆర్‌డీఏ, వ్యవసాయం, ఉద్యానవన,ఉపాధి తదితరశాఖల సమన్వయంతో నిర్వహిస్తామన్నారు. మంగళవారం పెనుబాక లో నిర్వహించిన సమావేశంలో ఆయన హోమ్ కంపోస్టు పిట్ తయారీ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు,ఏపీఎం హేమలత, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాలకు 24 గంటలూ త్రీఫేజ్

(5వ పేజీ తరువాయి)

ఫీడర్లు ఉన్నాయి. ఆర్డీఎస్ పథకంలో భాగంగా కొత్తగా మరో 40 ఫీడర్లు ఏర్పాటుచేయనున్నారు. వీటి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే రైస్‌మిల్లులు, త్రీఫేజ్‌పై ఆధారపడే పరిశ్రమలకు నిరంతరాయంగా విద్యుత్ అందుతుంది. ప్రస్తుతం జిల్లాలో రేగిడి, బొబ్బిలి, రామభద్రపురం, చీపురుపల్లి, మెరకముడిదాం, ఎస్.కోట, జామి, డెంకాడ, గజపతినగరం మండలాల్లో పనులు జరుగుతున్నాయి. 2027 నాటికి పూర్తిచేయాలన్నది ప్రభుత్వ సంకల్పం.

ఇదీ పరిస్థితి

జిల్లా వ్యాప్తంగా 96 విద్యుత్ సబ్‌స్టేషన్ల ద్వారా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించి 39,955 కనెక్షన్లు ఉన్నాయి. వీటికి మాత్రం రోజులో కేవలం తొమ్మిది గంటలు మాత్రమే త్రీఫేజ్ సరఫరా చేస్తున్నారు. అయితే వీటికి త్రీఫేజ్ ఉన్నప్పుడే గృహ వినియోగానికి సంబంధించి త్రీఫేజ్ అందించగలుగుతున్నారు. మిగతా సమయాల్లో సింగిల్ ఫేజ్ అందిస్తున్నారు. గృహ వినియోగదారులకు సంబంధించి 5.92 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాణిజ్య పరమైనవి 63,060 కనెక్షన్లు, పరిశ్రమలకు సంబంధించి 2,503, ప్రభుత్వ శాఖలకు సంబంధించి 14,218 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఆర్డీఎస్ పథకంతో ఈ విద్యుత్ వినియోగదారులకు 24 గంటలూ నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగనుంది.

శరవేగంగా పనులు

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. అందుకే ఆర్డీఎస్ పథకం ద్వారా కొత్తగా ఫీడర్లు ఏర్పాటుచేస్తున్నాం. ప్రస్తుతం తొమ్మిది మండలాల్లో పనులు జరుగుతున్నాయి. పూర్తయిన చోట గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ప్రారంభించాం. 2027 నాటికి జిల్లాలోని అన్ని గ్రామాలకు ఈ పథకం ద్వారా నాణ్యమైన విద్యుత్ అందిస్తాం.

- ఎం.లక్ష్మణరావు, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్, విజయనగరం

అపరాలకు ఆసరా ఏదీ?

(5వ పేజీ తరువాయి)

వేశారు. 14,507 మెట్రిక్ టన్నుల దిగుబడి రావాల్సి ఉంది. నవంబరు, డిసెంబరు నెలలో అకాల వర్షాలు నేపథ్యంలో కొంత మేర పంట నష్టపోయినా, మిగతా పంటపై కూడా ఎంతో కొంత ప్రభావం చూపింది. దీంతో రైతులకు పెట్టుబడి తప్ప ఆదాయం రాని పరిస్థితి నెలకొంది. క్వింటా పెసలుకు మద్దతు ధర రూ.8,682 కాగా మినుములుకు రూ.7,400గా ప్రభుత్వం ప్రకటించింది. ఈ ధర ఇచ్చి కొనుగోలు చేస్తే కాస్త మేలు జరిగేది. నిబంధనల పేరుతో మార్క్‌ఫెడ్ ముందుకు రావడం లేదు. మద్దతు ధర కంటే రూ.1,000 నుంచి రూ.1,500 తక్కువ ధరకు దళారులు పంటలను పట్టుకుపోతున్నారు.

లైటింగ్ ఏర్పాట్లు పూర్తిచేయండి

● తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు

చీపురుపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జాతర లైటింగ్ ఏర్పాట్లు ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని టీడీపీరాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు కోరారు. చీపురుపల్లిలో మార్చి రెండో తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న కనకమహాలక్ష్మి అమ్మవారిజాతర ఏర్పాట్లపై టీడీపీనాయకులతో మాట్లాడారు. ఆలయ ప్రాంగణంలో జరగాల్సిన ఏర్పాట్లపై ఆయన నాయకులకు సూచనలు చేశారు. జాతర జరిగే మూడురోజులు విద్యుత్, తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. శాంతి భద్రతలపై ఎస్‌ఐ ఎల్. దామోదరరావుతో మాట్లాడారు. అనంతరం, అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆయన వెంట పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, గవిడి నాగరాజు, ముల్లు రమణ, కలిశెట్టి సత్యానారాయణ, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఉన్నారు.

క్యాట్ బెంచ్ ఏర్పాటుపై హర్షం

కొత్తవలస, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్(క్యాట్)సర్క్యూట్ బెంచ్‌ను విజయవాడలో ఏర్పాటు చేయడంపై సౌత్ కోస్టు రైల్వే ఓబీసీ ఎంప్లాయిస్ జోనల్ అధ్యక్షుడు పి.రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని వివిధ కేంద్ర శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ నిర్ణయంతో ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. ఇప్పటి వరకూ ఉద్యోగపరమైన సమస్యలు ఎదురైతే క్యాట్‌ను ఆశ్రయించేందుకు హైదరాబాద్, కటక్, ఢిల్లీ వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు క్యాట్‌ను విజయవాడలో ఏర్పాటు చేయడంలో శాశ్వత పరిష్కారం దొరికిందన్నారు. ప్రస్తుతం ప్రతినెలా మూడో వారంలో 5 రోజుల పాటు నిర్వహిస్తున్నారని దీన్ని శాశ్వతం పూర్తి బెంచ్‌గా చేయాలని రైల్వే ఎంప్లాయిస్ తరఫున కేంద్రప్రభుత్వాన్ని కోరారు. ఇందుకు క్యాట్ సర్క్యూట్ బెంచ్ విజయవాడలో ఏర్పాటుకు కృషిచేసిన రాష్ట్రప్రభుత్వానికి, న్యాయమూర్తులు, బార్ కౌన్సిల్, క్యాట్ ఛైర్మన్, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పైప్‌లైన్ లీకేజీ పనుల పరిశీలన

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో వివిధ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశాలతో సిబ్బంది పరిశీలించారు. మంగళవారం 25వ డివిజన్ స్మృతివనం వద్ద పైప్‌లైన్ లీకేజీ పనులను డీఈ శ్రీనివాసరావు పరిశీలించారు. అలాగే ఉడా పార్కుతో పాటు పరిసర ప్రాంతాలను ప్లాంటేషన్ వర్కర్లతో శుభ్రం చేయించారు. ఉద్యానవన అధికారి ఉమాభరణి ప్రక్రియను పరిశీలించారు. నాయుడు కాలనీలో గుంతలు పూడ్చే పనులు, కెఎల్‌పురం వాటర్ ట్యాంకు వద్ద సీసీ రోడ్డు పనులు, గాజులరేగలో కవర్స్ ల్యాబ్ కాంక్రీట్ పనులు, రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సీసీ రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

నాణ్యమైన వైద్యంతో ఆరోగ్యాంధ్రప్రదేశ్: కమిషనర్

రాజాం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది నిబద్ధతతో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడం ద్వారానే ఆరోగ్యాంధ్రప్రదేశ్ కల సాకారమవుతుందని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు అన్నారు. మంగళవారం ఆదర్శనగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ ప్రథమ వార్షికోత్సవానికి కమిషనర్ హాజరై ఆశా వర్కర్లు, మహిళా ఆరోగ్యకార్యకర్తలు నిర్వహించిన పోస్టర్ ప్రెజెంటేషన్ తిలకించారు. ఈ సందర్భంగా అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఉత్తమ సేవలు అందించిన సంతోష్‌కుమారి, హరిబాబు, రాంబాబులను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజరు శ్రీనివాసరావు, ఏఈ వెంకట్, కె.అనూష, ఆప్తాలమిక్ అధికారి కె.వసంతరావు, కళావతి, సింహాచలం, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలపై చర్యలు

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో అనధికార నిర్మాణాలను ఉపేక్షించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. మంగళవారం ఆయన నగరంలోని పేర్లవారి జంక్షన్‌లో పర్యటించారు. ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. చిన్నవీధిలో కాలువను ఆక్రమించినిర్మాణాలు చేపట్టడంపె మందలించారు. ఆయనతో పాటు అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, టీపీవో అప్పలరాజు తదితరులున్నారు.

బాలల ఆరోగ్య సమాచారం సేకరణ

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బాలల సమగ్ర ఆరోగ్య పథకం పిల్లలకు వరం అని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. మంగళవారం నగరంలోని అన్ని సచివాలయాల పరిధిలో రాష్ట్రీయ బాలల స్వస్థ కార్యక్రమం ద్వారా పిల్లలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రీయ బాలల స్వస్థ కార్యక్రమంలో భాగంగా పిల్లల్లో రక్తహీనత, కంటి చూపు వంటి సమస్యలు తెలుసుకుని అవసరమైన మందులను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు.

రాకపోకలకు ఇబ్బంది కలిగించవద్దు

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారుల్లో తోపుడు బండ్లు పెట్టి ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించవద్దని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో తోపుడు బండ్ల వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎట్టి చర్యలను అనుమతించబోమన్నారు. ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకుంటే తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేటి నుంచి పార్వతమ్మ అమ్మవారి జాతర

పూసపాటిరేగ, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తకొప్పెర్ల లో బుధవారం నుంచి మూడు రోజుల పాటు పార్వతమ్మ అమ్మవారి జాతర నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు ఏటా జరిగే ఈజాతరకు వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకోనున్నారు.

సేంద్రియ ఎరువులు వాడండి

గజపతినగరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకుడు చంద్రశేఖర్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీరంగరాజపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు భూ ఆధార్‌లో నమోదు కావాలన్నారు. డ్రోన్ స్ప్రేయిర్‌తో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆయనతో పాటు ఏడీఏ మహరాజన్, ఏవో ధనలక్ష్మి ఉన్నారు.

గ్రామాల్లో ప్రశాంతత నెలకొల్పండి

గరివిడి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ప్రశాంతత నెలకొల్పడంతలో గ్రామ మహిళా కానిస్టేబుళ్ల ప్రముఖ పాత్ర పోషించాలని చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు పిలుపునిచ్చారు. మంగళవారం గరివిడి పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ లోకేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుళ్ళతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా డీఎస్పీ మహిళా కానిస్టేబుళ్లకు దిశా నిర్దేశం చేశారు.